సాక్షి
జగిత్యాల
మంగళవారం ‌। 18 ‌। ఏప్రిల్ ‌। 2023



కొండపై పూజలు

జగిత్యాల: సంగారెడ్డి కలెక్టర్ శరత్ సోమవారం కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.



క్రమబద్ధీకరించాలని వినతి

జగిత్యాల: ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం పంచాయతీ జూనియర్ కార్యదర్శులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

గరిష్టం/కనిష్టం
40.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

హింస ద్వారా పరధర్మాన్ని అణచడం రక్తపాతం కంటే అత్యంత తీవ్రమైనది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6.36	బుధ 4.30

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లింబాద్రి



లింబాద్రిని అభినందిస్తున్న న్యాయవాదులు

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ స్థానానికి పుప్పాల లింబాద్రి, అలాల సత్యనారాయణ, బర్ల లక్ష్మణ్ పోటీపడ్డారు. వీరిలో అత్యధిక ఓట్లు సాధించిన లింబాద్రి అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వడ్డెపల్లి శ్రీనివాస్, మగ్గిడి వెంకటనర్సయ్య, రాజ్‌మహమ్మద్ ప్రకటించారు. గతంలో మూడు పర్యాయాలు లింబాద్రి అధ్యక్షుడిగా పనిచేశారు. మరోసారి ఎన్నికైన ఆయనను న్యాయవాదులు అభినందించారు. న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని లింబాద్రి పేర్కొన్నారు.

జూన్‌లో 'రోళ్లవాగు' పూర్తి



పనులు పరిశీలిస్తున్న అధికారులు

సారంగాపూర్(జగిత్యాల): వచ్చే జూన్ 30నాటికి రోళ్లవాగు ప్రాజెక్టు పనులు వందశాతం పూర్తికావాలని క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ వెంకటకృష్ణ ఆదేశించారు. బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సోమవారం ఆయన తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, ప్రగతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, కట్టకు రెండుచోట్ల రాళ్లతో తెట్టె పనులు 710 మీటర్లు పూర్తిచేయాల్సి ఉందన్నారు. దీనితోపాటు 710 మీటర్ల కట్టను మరో 9 మీటర్ల ఎత్తు పెంచాల్సి ఉందని పేర్కొన్నారు. వీటిని జూన్ చివరి నాటికి పూర్తినాణ్యతతో చేయాలని ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ దేవేందర్‌రెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఎస్ఈ అశోక్‌కుమార్, ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్ పాల్గొన్నారు.

సర్వే నంబరు 924పై ఫిర్యాదు

కోరుట్ల: జంబిగద్దె ప్రాంతంలోని సర్వే నంబరు 924లోనిది ప్రభుత్వ భూమి కాదని, అది మాన్యం భూమి అని పట్టణానికి చెందిన హిందూ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఇందూరి సత్యం తెలిపారు. ఈమేరకు సోమవారం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. 924 సర్వే నంబరులోని 52 ఎకరాల్లో అతిపురాతన శ్రీవేంకటేశ్వర ఆలయ మాన్యం ఉందన్నారు. దీనిపై నిజానిజాలు తెలుసుకునేందుకు 1950నుంచి కాస్ర పహణీపై విచారణ చేపట్టాలని కోరారు. ఈ స్థలంలో దసరా ఉత్సవాల కోసం జంబిగద్దె నిర్మించారని, ఏటా శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిపై పూర్తివిచారణ చేపట్టి ఆ స్థలాన్ని ఆలయానికి అప్పగించాలని ఆయన కోరారు.

కాలుష్య కారక పరిశ్రమ వద్దు



సభకు హాజరైన గ్రామస్తులు

వెల్గటూర్(ధర్మపురి): కాలుష్య కారక, అనారోగ్య సమస్యలు తెచ్చిపెట్టే ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని వెల్గటూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించేందుకు సోమవారం మండల కేంద్రంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. తొలుత గ్రామస్తులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా పాశిగామ, స్తంభంపల్లి, వెంకటాపూర్ గ్రామస్తులు 18రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఫ్యాక్టరీతో భూగర్భ జలాలు, గాలి కలుషితమవుతాయని తెలిపారు. తద్వారా భవిష్యత్ తరాలకు ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పరిశ్రమకు వ్యతిరేకంగా నిరసలు చేస్తున్నామని అన్నారు. పరిశ్రమపై అవగాహనలేని కొందరు నాయకులు.. ఏవేవో మాట్లాడుతున్నారని, తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీతో ప్రయోజనాలు తప్ప కాలుష్యం లేకుంటే కంపెనీ సాంకేతిక నిపుణులు పరిశ్రమ గురించి ఎందుకు ప్రజలకు వివరించడం లేదని గ్రామస్తులు ప్రశ్నించారు.

ప్రజావాణి.. పరిష్కారం ఏది?

- తూతూమంత్రంగా నిర్వహణ
- శ్రద్ధ చూపని అధికారులు
- ప్రజల నుంచి స్పందన కరువు
- అధికారుల తీరుపై ఆగ్రహం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌తోపాటు జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, తహసీల్దార్ కార్యాలయాల్లో గత మార్చి 18వ తేదీ నుంచి ప్రతీసోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. తొలుత అభాగ్యులు తమ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించినా.. పరిష్కారంలో తీవ్ర జాప్యం కావడంతో బాధితులు మళ్లీ అటువైపు వెళ్లడంలేదు. దీంతో ప్రతీవారం తూతూమంత్రంగా ప్రజావాణి నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒక్క కలెక్టరేట్‌లో స్వీకరించిన దరఖాస్తులకు తప్ప మరెక్కడా సమస్యలకు పరిష్కారం లభించడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జిల్లా కేంద్రంతోపాటు ధర్మపురి, మెట్‌పల్లి, రాయికల్, కోరుట్లలో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాల తీరు పరిశీలించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మకరంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి 23 దరఖాస్తులు అందాయి.

పల్లెప్రగతి బిల్లులు రాలేదు



అర్జీ అందిస్తున్న సర్పంచ్ శిల్ప

పల్లెప్రగతి కింద వివిధ పనులు చేపట్టిన. చెక్కులు పాస్ చేయడంలో ఎంపీవో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అధికారుల ఆదేశాలతో పనులను సకాలంలో పూర్తిచేయించినా. అయినా బిల్లులు విడుదల చేయడంలో జాప్యం ఎందుకు?

– శిల్ప, సర్పంచ్, బీర్‌పూర్

సర్పంచ్ భర్తతో ప్రాణభయం




వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ భర్త దావు సత్తయ్యతో ప్రాణభయం ఉంది. గత ప్రభుత్వాలు నిర్మించి ఇచ్చిన ఇళ్లలో ఉంటున్నం. కూలీ పనులు చేసుకుని బతుకుతున్నం. మేం లేని సమయంలో వాకిళ్లు, స్నానాల గదులు, మరుగుదొడ్లు కాల్చివేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోమని సర్పంచ్ భర్త బెదిరించాడు. సత్తయ్య, ఆయన సోదరులతో మాకు ప్రాణభయం ఉంది.

– లక్ష్మీపూర్ దళితులు

కోర్టు ఉత్తర్వులు అమలు చేయండి



వినతిపత్రం చూపిస్తున్న వినయ్‌సాగర్

మా నాన్న సామ మల్లయ్య 1969లో బల్వంతాపూర్ సర్వే నంబరు 269సి, 275కెలో 3.12 ఎకరాలు కొనుగోలుచేసిండి. 2009లో పాసుబుక్కులు వచ్చాయి. 1బిలో పేరు నమోదైంది. మా అమ్మ సత్తమ్మ పేరిట వారసత్వ మార్పిడి చేయించాం. కానీ, నల్ల లక్ష్మారెడ్డి.. రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి ఆయన మనవడు సంత జలందర్‌రెడ్డి పేరిట మార్పిడి చేసుకున్నాడు. రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే మళ్లీ మా అమ్మ పేరిట మార్చారు. దీనిని వ్యతిరేకిస్తూ జలందర్‌రెడ్డి కోర్టుకు పోయిండు. జలందర్‌రెడ్డి పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. సత్తమ్మకు ఆ భూమి చెందుతుందని తీర్పు ఇచ్చింది. ఈ విషయాన్ని రెవెన్యూ రికార్డులో నమోదు చేయాలని మల్యాల తహసీల్దార్‌ను సంప్రదించినా పట్టించుకోవడం లేదు.

– వినయ్‌సాగర్, ముత్యంపేట

వచ్చింది ఎనిమిది అర్జీలే..



దరఖాస్తు స్వీకరిస్తున్న కమిషనర్

రాయికల్(జగిత్యాల): స్థానిక మున్సిపాలిటీలో మార్చి 18 నుంచి ప్రతీ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కమిషనర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువవుతోంది. మార్చి నుంచి ఇప్పటిదాకా పలు సమస్యలపై 8 దరఖాస్తులు రావడం ఇందుకు అద్దంపడుతోంది. అయితే, ఎనిమిది సమస్యల్లో ఐదింటిని పరిష్కరించామని కమిషనర్ తెలిపారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరించేలా చర్యలు చేపడతామని అన్నారు. ముఖ్యంగా కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, సీసీరోడ్లు నిర్మించాలని, డ్రైనేజీల్లో చెత్తాచెదారం తొలగించాలని ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వివరించారు.

కుమ్మరికుంటను కాపాడండి



ఆవేదన వ్యక్తం చేస్తున్న కుమ్మరులు

కొడిమ్యాల గ్రామంలోని కుమ్మరికుంటను కాపాడాలి. కుంటలోని నాణ్యమైన మట్టితో పాత్రలు తయారు చేస్తున్నాం. దానిపై సుమారు 60కుటుంబాలు దశాబ్దాలుగా ఆధారపడి బతుకుతున్నాయి. ఎకరం విస్తీర్ణంలోని కుమ్మరికుంటను ముదిరాజ్‌లు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. వారివారి నుంచి కుమ్మరికుంటను కాపాడాలి. అధికారులు తక్షణమే చొరవ తీసుకోవాలి.

– కుమ్మరులు, కొడిమ్యాల

స్పందన కరువు

ధర్మపురి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. కానీ, ముగ్గురు అధికారులే హాజరయ్యారు. ఇద్దరు అభాగ్యులే పలు సమస్యలపై దరఖాస్తు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించినా ఒక్కరూ అటువైపు వెళ్లలేదు.

75 రోజులైనా మోక్షం లేదు



కమలాపూర్ శివారులోని 521 సర్వే నంబరులో నాకున్న భూమి హద్దులు చూపించాలని గత జనవరి 30న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న. అధికారులు ఇప్పటికీ మోకాపైకి రాలేదు. మళ్లీ తహసీల్దార్ కార్యాలయంలో మరోసారి దరఖాస్తు చేసుకున్న. ఇప్పటికైనా నా భూమి హద్దులు చూపించాలె.

– రఘువర్మ, అర్జీదారు

అర్జీల స్వీకరణకే పరిమితం!



అర్జీ స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్

మెట్‌పల్లి(కోరుట్ల): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రతీసోమవారం నిర్వహించే ప్రజావాణికి వస్తున్న సమస్యలను పరిష్కరించే విషయంలో అధికారులు అంతగా దృష్టి సారించడం లేదు. దరఖాస్తుల స్వీకరణకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. గత మార్చినుంచి ఇప్పటివరకు ప్రతీసోమవారం నిర్వహించిన ప్రజావాణికి 13 అర్జీలు రావడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, టౌన్ ప్లానింగ్ సమస్యలపై అధికంగా అర్జీలు అందుతున్నాయి. అయితే, నిధులు, సిబ్బందితో సమస్యలను సకాలంలో పరిష్కరించలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు.. ఎంతోఆశతో ప్రజావాణికి దరఖాస్తు చేస్తున్న అభాగ్యులకు నిరాశే ఎదురవుతోంది.

ఎనిమిది గంటలు ఉత్కంఠ

- స్ట్రాంగ్‌రూమ్ తాళం చెవుల మాయంపై సుదీర్ఘ విచారణ
- హాజరైన అప్పటి, ప్రస్తుత ఐఏఎస్ అధికారులు
- ప్రభుత్వం స్పందించాలన్న డీసీసీ అధ్యక్షుడు 'అడ్లూరి'



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల: మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే కళాశాలలో 2018 ధర్మపురి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళం చెవులు మాయంపై సోమవారం ఢిల్లీ నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారులు సుమారు ఎనిమిది గంటలపాటు విచారణ జరిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ సుదీర్ఘంగా జరిగిన విచారణలో తాళం చెవులు ఎలా మాయమయ్యాయనే అంశమే ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అయితే, ప్రత్యర్థి, కాంగ్రెస్ నేత అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహా మీడియాను కూడా విచారణ జరిపిన కొండగట్టు సమీపంలోని నాచుపల్లి జేఎన్టీయూ దరిదాపుల్లోకి కూడా అధికారులు అనుమతించలేదు. దీంతో విచారణ ఎలా జరుగుతోందనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగింది. మరోవైపు.. విచారణకు అనువుగా ఉంటుందనే ఆలోచనతోనే జేఎన్టీయూను ఎంచుకున్నట్లు తెలిసింది. అప్పటి కలెక్టర్ శరత్, ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ రవి, ప్రస్తుత కలెక్టర్ యాస్మిన్‌బాషాతోపాటు పలువురు అడిషనల్ కలెక్టర్లు విచారణకు హాజరయ్యారు.

ఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు..

సుమారు నెలరోజులుగా ఉత్కంఠ రేపుతున్న ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ స్ట్రాంగ్‌రూమ్ తాళం చెవుల మాయంపై హైకోర్టు విచారణకు ఆదేశించింది. ఈక్రమంలో చేపట్టిన విచారణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ భాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందో బోస్తు ఏర్పాటు చేశారు. జేఎన్టీయూకు సుమారు 500 మీటర్ల పరిధిలోకి ఎవరినీ అనుమతించలేదు.

ఏం జరిగిందంటే..

2018లో ధర్మపురి అసెంబ్లీ(ఎస్సీ) ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్ పోటీచేశారు. వీఆర్‌కే కళాశాలలో ఓట్లు లెక్కించారు. అతితక్కువ మెజారిటీతో లక్ష్మణ్‌కుమార్ ఓటమిపాలయ్యారు. కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. సుమారు నాలుగేళ్లుగా విచారణ జరుగుతోంది. కోర్టు ఆదేశాలతో స్ట్రాంగ్‌రూమ్ తెరిచేందుకు వెళ్లిన అధికారులకు తాళాలు తెరుచుకోలేదు. ఇదే విషయాన్ని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాళం చెవుల మాయంపై సమగ్ర నివేదిక కావాలని, ఇందు కోసం విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, తాము ప్రతినెలా 3వ తేదీన స్ట్రాంగ్‌రూమ్ తనిఖీ చేశామని, నిబంధనలు కచ్చితంగా పాటించామని, ఎన్నికల సామగ్రి పటిష్ఠంగానే భద్రపర్చామని విచారణ అధికారులకు చెప్పినట్లు తెలిసింది.

ప్రభుత్వం స్పందించాలి

స్ట్రాంగ్‌రూమ్ తాళం చెవులు మాయంపై ఢిల్లీ నుంచి ఐఏఎస్ అధికారులు వచ్చి విచారణ చేపట్టడం ఘటన తీవ్రతకు అద్దంపడుతోంది. ప్రభుత్వం కూడా విచారణ చేపట్టాలి. కోర్టు ద్వారా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి

మన ఊరు.. మన బడితో విద్యార్థులకు నాణ్యమైన విద్య



పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): నాణ్యమైన విద్య అందించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్న గొప్ప సంకల్పంతో సీఎం కేసీఆర్ మన ఊరు–మన బడికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మన ఊరు.. మన బడి అభివృద్ధి పనులు పూర్తిచేసిన మద్దులపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయిలో విద్య చేరువగా చేయడమే పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేసినా.. మద్దులపల్లి నుంచి బీఆర్ఎస్‌కు ఆశించినస్థాయిలో ఓట్లు రావడంలేదని ఆవేదన చెందారు. అనంతరం 29 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. వివిధ కుల సంఘాలతో సమావేశమయ్యారు. పెగడపల్లి, నామాపూర్, మద్దులపల్లిలో సహకార సంఘాలు, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. మద్దులపల్లిలో మంచినీటి ట్యాంకులు ప్రారంభించారు. ఆరవెల్లిలో యావద సంఘం మిగులు పనులు, బతికపల్లి – ఆరవెల్లి మధ్య వంతెన పనులకు భూమిపూజ చేశారు. సీసీరోడ్లు ప్రారంభించారు. ఎంపీపీ శోభ, ఏఎంసీ చైర్‌పర్సన్ నిర్మల ఉన్నారు.

ఇంటికి పోను.. హాస్టల్‌లోనే ఉంటా



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

జగిత్యాలక్రైం: హన్మాజీపేటకు చెందిన బొల్లె అర్చన (9)స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. గతంలోనే తల్లి చనిపోయింది. దీంతో కొద్దిరోజుల పాటు తన పెద్దమ్మ వద్ద తలదాచుకుంది. అక్కడ బంధువులు మందలించడంతో ఐదు నెలలుగా తండ్రి అంజయ్య వద్ద ఉంటోంది. అయితే, తరచూ సెల్‌ఫోన్ వినియోగిస్తుండడంతో అలా చేయొద్దని తండ్రి మందలించాడు. మనస్తాపం చెందిన బాలిక.. ఆదివారం నడుచుకుంటూ సుమారు రెండు కి.మీ. దూరంలోని స్థానిక కొత్తబస్టాండ్‌కు చేరుకుంది. స్థానికులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి బాలికను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే, తాను ఇంటికి వెళ్లనని బాలిక చెప్పింది. పోలీసుల సూచనతో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు అర్చనను సఖీ కేంద్రం నిర్వాహకులకు అప్పగించారు. వారు బాలిక తండ్రితోపాటు సర్పంచ్‌ను సఖీ కేంద్రానికి పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. తన కూతురును ఇంటికి తీసుకెళ్తానని చెప్పాడు. తనను సెల్‌ఫోన్ చూడనివ్వడం లేదని, అందుకే ఇంటికి వెళ్లబోనని బాలిక మొండికేసింది. దీంతో సఖీ నిర్వాహకులు జిల్లా కేంద్రంలోని బాలికల వసతి గృహానికి సోమవారం తరలించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం

జగిత్యాలక్రైం: అగ్నిప్రమాదాల నియంత్రణపై ప్రజల్లో చైతన్యం తేవాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కొమురయ్య అన్నారు. పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్ల ప్రజలకు సోమవారం అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రుల్లోనూ సిబ్బంది స్పందించి అగ్నిప్రమాదాల నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

రికవరీపై నిర్లక్ష్యం!

- మహిళా సంఘాల్లో అక్రమాలు
- రుణ వాయిదాల చెల్లింపుల్లో ఆర్పీల చేతివాటం
- విచారణ జరిపి తేల్చినచెప్పిన అధికారులు
- దుర్వినియోగమైన సొమ్ము స్వాధీనానికి ఆదేశాలు
- అయినా జమకాని డబ్బులు



జగిత్యాల: జిల్లాలోని మహిళా సంఘాల్లో దుర్వినియోగమైన సొమ్ము రికవరీపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు మంజూరు చేస్తోంది. వీటిని తీసుకున్న మహిళలు ప్రతినెలా రుణవాయిదాలను సక్రమంగా చెల్లిస్తున్నారు. అయితే, ఈ సొమ్మును తమకు సన్నిహితంగా ఉండే ఆర్పీలకు అప్పగించి, బ్యాంకులో జమచేయాలని కోరుతున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు ఆర్పీలు ఆ సొమ్మును సొంతానికి వాడుకుంటున్నారు. ఇలా ఇప్పటిదాకా రూ.లక్షల్లో దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు.

రాయికల్‌లో రూ.19లక్షలు దుర్వినియోగం..

- రాయికల్‌లోని మహిళా సంఘాల సభ్యులకు చెందిన రూ.19 లక్షలను ఆర్పీ మహేశ్ దుర్వినియోగం చేశారని ఆరోపణలు వచ్చాయి.
- దీనిపై అధికారులు విచారణ జరిపి నిధులు దుర్వినియోగమైన మాట నిజమేనని తేల్చారు.
- ఇదే విషయంపై పోలీస్‌స్టేషన్‌లో నిందితులపై కేసు నమోదు చేశారు.
- అయితే, వారం రోజుల్లో ఆ సొమ్ము చెల్లిస్తానని ఆర్పీ చెప్పినా నేటికీ ఒక్క రూపాయి కూడా రికవరీకాలేదు.

కరువైన పర్యవేక్షణ

- బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న మహిళా సంఘాలు.. వాటిని సద్వినియోగం చేసుకున్నాయా? రుణ వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్నాయా? అనే అంశాలపై అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాలి.
- అంతేకాదు.. కమ్యూనిటీ ఆర్గనైజర్లు, టీఎంసీ, ఏడీఎంసీ, డీఎంసీ, పీడీతోనూ క్షేత్రస్థాయిలో తరచూ సమావేశాలు నిర్వహించి రుణాల వినియోగం, వాయిదాల చెల్లింపు, మహిళా సంఘాల కార్యకలాపాలు, బకాయిలపై సమీక్షించాలి.
- కానీ, క్షేత్రస్థాయిలో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఇలాంటి చర్యలు ఎక్కడా తీసుకున్న దాఖలాలు కనిపించడంలేదు.
- అధికారులు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రికవరీ చేస్తాం

మహిళా సంఘాల్లో దుర్వినియోగమైన సొమ్ము స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే స్త్రీనిధి రుణాలు చాలా వరకు దుర్వినియోగమైనట్లు విచారణలో తేలింది. ఇందుకు బాధ్యులైన చాలామందిపై పోలీసు కేసులు నమోదయ్యాయి. దుర్వినియోగమైన సొమ్ము తిరిగి చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళా సంఘా సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఆనందరావు, ఆర్ఎం, స్త్రీనిధి

- మెట్‌పల్లి మున్సిపల్‌లోని ఓ ఉద్యోగి భార్య ఆర్పీగా పనిచేస్తున్నారు.
- ఆమె మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన రుణవాయిదాలు సుమారు రూ.4 లక్షలు సొంతానికి వినియోగించినట్లు విచారణలో వెలుగుచూసింది.
- ఆ సొమ్ము నేటికీ రికవరీ కాలేదు.
- జగిత్యాల మున్సిపల్‌లో సైతం కొందరు మహిళా సంఘాల సభ్యులు ఆర్పీలకు చెల్లించినప్పటికీ స్త్రీనిధి రణాలు అలాగే ఉండటంతో ఇటీవలే బయటకు పొక్కింది. దానిపై సైతం అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నారు. ఇందులో అనేకంగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం..

మెప్మా అధికారులతో కలెక్టర్ యాస్మిన్ బాషా ఇటీవల సమావేశమయ్యారు. మహిళా సంఘాలు రుణ వాయిదాలు చెల్లించడంలో వెనుకబడుతున్నాయని, అధికారులు ఏం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అంతేకాదు.. తక్షణమే మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలతో సమావేశమై.. బకాయిలు, రుణ వాయిదాలు, రికవరీలపై సమీక్షించాలని ఆదేశించారు. బకాయిలు వసూలయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఒకవేళ మహిళా సంఘా సభ్యులు సమావేశాలకు హాజరుకాకుంటే.. వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వారిని అందుబాటులోకి తీసుకోవాలని అన్నారు. దీంతో స్పందించిన అధికారులు.. రంగంలోకి దిగినా ఆశించిన ప్రగతి సాధించడంలేదు. ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే మెప్మాలో జరిగిన మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్రమబద్ధీకరణకు మోక్షమెప్పుడో..!

- జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఎదురుచూపులు
- నాలుగేళ్లు పూర్తయినా వెలువడని ఉత్తర్వులు
- జిల్లాలో 278 మంది విధుల నిర్వహణ


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గొల్లపల్లి (ధర్మపురి) /మల్లాపూర్ (కోరుట్ల) : గ్రామ పంచాయతీలతో పాటు గ్రామాల ప్రగతికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) కీలకం. ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేస్తుందని ఎదురుచూస్తున్నా ఎలాంటి ఉత్తర్వులు వెలువడ లేదు. ఉద్యోగ ఎంపిక నోటిఫికేషన్‌లో మూడేళ్లకే రెగ్యులరైజ్ నిబంధన ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం మరో సంవత్సరం గడువుపెంచుతూ 2022 జూలైలో జీవో నెంబర్ 26ను తీసుకొచ్చింది. దాని ప్రకారం మరో సంవత్సరం అప్రెంటీస్ పీరియడ్ లోనూ విధులు నిర్వహిస్తున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులను ప్రభుత్వం ఏప్రిల్ 12, 2019లో టీఎస్‌పీఆర్‌ఐ కింద భర్తీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 9,533 మంది ఉద్యోగాల్లో చేరారు. ఈనెల 11తో ప్రభుత్వం ప్రకటించిన విధంగా నాలుగేళ్ల సర్వీస్ పూర్తయినా సీఎం కేసీఆర్ ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో వారు ఆందోళన మొదలుపెట్టారు. ఈ నెల 28లోగా సర్వీస్ క్రమబద్ధీకరణపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే సమ్మెకు దిగుతామని ప్రకటించారు.

278 మంది జేపీఎస్‌లు..

జిల్లాలో 278 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇటీవల నూతనంగా ఏర్పాటైన మూడు మండలాలతో కలిపి 18 మండలాల పరిధిలోని 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 73 మంది సీనియర్ పంచాయతీ కార్యదుర్శులుండగా 2019 నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్ అయిన వారు 278 మంది ఉన్నారు. మరో 28 మంది ఔట్‌సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీ (ఓపీఎస్) లున్నారు. నాలుగేళ్లుగా జేపీఎస్‌లు ప్రతిగ్రామాన్ని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్ది జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో అవార్డులు రావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

పనిభారంతో సతమతం..

పని భారంతో పంచాయతీ కార్యదర్శులు సతమతమవుతున్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన వాటితో పాటు ఇతర శాఖల పనులు సైతం చేస్తున్నారు. వచ్చిన వేతనంతో పంచాయతీ పరిధిల్లో తడిచెత్త, సెగ్రిగేషన్, శానిటేషన్, నర్సరీ, హరితాహారం, ఆర్వోఫ్‌ఆర్ పట్టాల విధులతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో తలమునకలవుతున్నారు. రెవెన్యూ శాఖలో వీఆర్వో వ్యవస్థ రద్దుకావడంతో అందుకు సంబంధించిన విధులను సైతం పంచాయతీ కార్యదర్శులే నిర్వర్తించాల్సి వస్తోంది. అయినా ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పించడం లేదు.

జేపీఎస్‌ల డిమాండ్లు ఇవే..

- జేపీఎస్‌లను వెంటనే రెగ్యులరైజ్ చేస్తూ జీవో విడుదల చేయాలి. దీంతో పాటు గడిచిన నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలి.
- ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోట్ చేస్తూ వారు పనిచేసిన కాలాన్ని ప్రొబెషనరీ పీరియడ్‌గా పరిగణించి వారిని కుడా రెగ్యులరైజ్ చేయాలి.
- రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్‌స్ట్రెంత్‌ను నిర్ధారించాలి.
- మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాల కోసం కారుణ్య నియామకాలు చేపట్టాలి.
- అర్హులైన పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు ఇవ్వాలి.
- 317 జీవోతో నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలి. పరస్పర, స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించాలి.

రెగ్యులరైజ్ కోసం ఎదురుచూపు..

ప్రస్తుతం వారు ప్రతినెలా రూ.28,719 గౌరవ వేతనంతో పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడువులోగా తమను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేస్తుందని ఆశపడ్డ తమకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జేపీఎస్‌లను ఈనెల చివరికల్లా రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు.

జీవో విడుదల చేయాలి



జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం జీవోను విడుదల చేయాలి. విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జీవో విడుదల చేస్తారని ఆశించాం. ఈనెల చివరి వరకు రెగ్యులరైజ్ చేసి జేపీఎస్‌ల్లో ఉన్న అభద్రతా భావాన్ని తొలగించాలి.

– షరీఫ్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండల అధ్యక్షుడు

రెగ్యులరైజ్ చేయాలి



జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు రెగ్యులరైజ్ చేయాలి. నోటిఫికేషన్‌లో మూడు సంవత్సరాలు ఉన్నా ప్రభుత్వ నిబంధన మేరకు మరో సంవత్సరం అప్రెంటీస్‌లోనే ఉన్నాం. తమను గుర్తించి జేపీఎస్‌లను క్రమబద్ధీకరించేందుకు చొరవచూపాలి.

– నదీమ్, పంచాయతీ కార్యదర్శి

డిమాండ్లు నెరవేర్చాలి..



నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం మూడేళ్ల ప్రొబెషనరీ పీరియడ్ ఏడాది కిందే పూర్తయ్యింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఇంకో ఏడాది ప్రొబెషనరీ పీరియడ్ కూడా ముగిసింది. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి ఇతర డిమాండ్లనూ నేరవేర్చాలి.

–కొమురయ్య, జేపీఎస్ సంఘం,–జగిత్యాల

క్లుప్తంగా

ట్రాక్టర్ డ్రైవర్ మృతిపై సీఐ విచారణ


సీఐతో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని తక్కళ్లపెల్లి శివారులో ఈనెల 9న ట్రాక్టర్ డ్రైవర్ బొడ్డుసాగర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. వరదకాలువ పక్కన రాళ్ల మధ్యలో సాగర్ మృతదేహం పడి ఉందని, శరీరం, తలపై తీవ్రగాయాలున్నట్లు గ్రామస్తులు సీఐకి వివరించారు. అనంతరం సీఐతో బీఎస్పీ నాయకులు సీఐతో మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్టు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఇక్కడ బీఎస్పీ మండలాధ్యక్షుడు తెడ్డు శేఖర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బాలె నీలకంఠం, కలిగోట రాజన్న, పాలెపు సంజీవ్, చాకలి వెంకటేశ్, పాడేటి అర్జున్, గణేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల అమలులో ప్రభుత్వం విఫలం


డాక్టర్ నగేశ్

వెల్గటూర్ : మరోసారి అధికారంలోకి వచ్చేందుకే తెలంగాణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, అంబేడ్కర్ ఆశయాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.కె నగేశ్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో సీబీఐ ద్వారా కేసు విచారణ చేపట్టాలని, పార్టీ అధినేత్రి షర్మిల సోమవారం ఇందిరాపార్క్ వద్ద చేపట్టే నిరాహార దీక్షకు అనుమతి ఇవ్వకుండా ఆమెను నిర్బంధించడాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తెలంగాణలో రానున్నది రాజన్న రాజ్యమేనన్నారు.

కార్యవర్గం ఎన్నిక

జగిత్యాల రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ అధ్యక్షుడు కొమురయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొమురయ్య, జనరల్ సెక్రటరీగా సంతోష్, కోశాధికారిగా నదీం హుస్సేన్, ఉపాధ్యక్షులుగా రవళి, స్వర్ణ, ఎండీ.షరీఫ్, వంశీరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా అజయ్, వేణుగోపాల్, మీడియా కన్వీనర్‌గా మల్లికార్జున్, వైభవ్, సునావత్ రాజ్‌ను ఎన్నుకున్నారు.

ఎండ తగలకుండా..


మనుమడిని సైకిల్‌పై తీసుకెళ్తున్న తాత

జగిత్యాల రూరల్ : రోజురోజుకూ భానుడు భగభగ మండుతున్నాడు. గోవిందుపల్లిలో ఓ ప్రైవేట్ పాఠశాల సమయం ముగిశాక బాలుడిని తన తాత తీసుకెళ్లేందుకు వచ్చాడు. మనమడిపై ఉన్న మమకారంతో ఎండ తగలకుండా గొడుగుతో సైకిల్‌పై కూర్చొబెట్టి ఇంటికి తీసుకెళ్లాడు.

చిన్నారికి ఆపన్నహస్తం


చెక్కు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

పెగడపల్లి : క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడిని ఆదుకునేందుకు ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ సభ్యులు ఆపన్నహస్తం అందించారు. గొల్లపల్లి మండలంలోని రంగదాముని పల్లికి చెందిన రాగల్ల తిరుపతి–రాగిని దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రిత్విక్ (7) క్యాన్సర్‌తో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే ఐదారు లక్షలు ఖర్చుచేయగా కుమారుడి వైద్యంకోసం ఆర్థిక సాయం అందించాలని బాలుడి తల్లిదండ్రులు నంచర్లకు చెందిన శ్రీరామ చారిటబుల్ ట్రస్టు సభ్యులను కోరారు. దీంతో సహాయం కోసం సామాజిక మాధ్యమాల్లో ట్రస్ట్ సభ్యులు పోస్టుచేశారు. ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ సభ్యులు రూ.లక్షా 71 వేలు ట్రస్ట్‌కు పంపించగా సోమవారం బాలుడి తండ్రి తిరుపతికి చెక్కు అందజేశారు. ఎంపీపీ శోభ –సురేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వేణు గోపాల్, ఉప సర్పంచ్ తిరుపతి యాదవ్, ట్రస్ట్ సభ్యులు మల్లేశం గౌడ్, శ్రీనివాస్, సంతోష్ గౌడ్, వేణు, రాజేశం, చంద్రయ్య, నాగభూషణం, రాజయ్య, రవీందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కొమురయ్య, లచ్చయ్య, శంకరయ్య, లక్ష్మీ రాజం, లక్ష్మణ్ ఉన్నారు.

లారీ డ్రైవర్‌పై కేసు

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ వద్ద జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన నక్క రాజేశ్ ఈనెల 14న రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా నిజామాబాద్ జిల్లాకు చెందిన దరావత్ అనిల్ అజాగ్రత్తతో లారీతో రాజేశ్‌ను ఢీకొట్టాడు. బాధితుడి భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణం


కల్యాణ వేడుకల్లో యాదవులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బీరప్పకామరాతి కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించారు. బీరప్ప కళాకారుల నృత్యాలు, గాండ్రింపులు ఆకర్షణగా నిలిచాయి. టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు, సర్పంచ్ కదిరి రజిత, యాదవ కుల సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తికి జరిమానా

జగిత్యాల జోన్ : విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఓ వ్యక్తికి రూ.64,122 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి వీరయ్య సోమవారం తీర్పుచెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్గారం మండల కేంద్రానికి చెందిన నగునూరి నర్సగౌడ్ తన ఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండగా అధికారులు పట్టుకొని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేయడంతో మొదటి తప్పుగా భావించి రూ.వెయ్యి జరిమానా విధించారు. నర్సగౌడ్ మళ్లీ 2017లో మరోసారి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండగా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం అతనికి రూ.64,122 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకపోతే 6 నెలల సాధారణ జైలుశిక్ష ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సైలు నిరంజన్‌రెడ్డి, నరేశ్, విజిలెన్స్ సిబ్బందిని సీఐ స్వామి అభినందించారు.

గుండెపోటుతో మహిళ మృతి

కోనరావుపేట : మండలంలోని మర్రిమడ్ల గ్రామానికి చెందిన ఓ మహిళ గుండెపోటుతో మృతిచెందింది. గ్రామానికి చెందిన గుండం రాజ్యలక్ష్మి (44) రెండ్రోజులగా వ్యవసాయ పనులకు వెళ్లింది. సోమవారం ఉదయం ఇంట్లోనే గుండెపోటుతో మృతిచెందింది. భర్త లక్ష్మీరాజం కూలీపనులు చేస్తుంటాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు శివరాణి, శివాని ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు జింక శ్రీనివాస్ కోరారు.

చెట్టును ఢీకొన్న డీసీఎం వ్యాన్

- డ్రైవర్ మృతి, మరొకరికి తీవ్రగాయాలు

సత్తుపల్లి టౌన్: ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి డీసీఎం వ్యాన్ చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యా యి. సత్తుపల్లి శివారులో సోమవారం చోటు చేసుకున్న సంఘటనా వివరా లిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన ఈడపల్లి నరేశ్ (32) తన స్నేహితుడు చిర్రా నరేశ్‌తో కలిసి అనకాపల్లికి వెళ్లాడు. అక్కడి నుంచి కరీంనగర్‌కు సెంట్రింగ్ కర్ర లోడ్‌తో డీసీఎంలో ఆదివారం రాత్రి బయలుదేరాడు. సోమవారం తెల్లవారుజామున సత్తుపల్లి మండలం తాళ్లమడ పెద్దవంతెన సమీపంలో డ్రైవర్ మూలమలుపు వద్ద ఎ దురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొ ట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఈడపల్లి నరేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సౌజన్య ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం బంధువులకు అప్పగించారు. ఈ ప్రమాదంలో గాయపడిన తన ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారని వ్యాన్ డ్రైవర్ స్నేహితుడు చిర్రా నరేశ్ తెలిపారు. సత్తుపల్లి ఎస్సై బాణాల రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు చెక్కుల పంపిణీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ధర్మపురి: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉన్న మహిళా సంఘాలకు పావులా వడ్డీ రుణాల చెక్కులను మంగళవారం పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా తదితరులు హాజరుకానున్నారు. ఐదు మండలాల్లోని 3,729 మహిళా సంఘాలకు 6.93 కోట్ల వడ్డీ చెక్కులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు.డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో డీపీఎం మాణిక్‌రెడ్డి, అడిషనల్ డీఆర్‌డీఏ సుధీర్, సీఐ కోటేశ్వర్, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాగునీటి వసతితో పాటు అన్ని ఏర్పాట్లు చేశారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

కోరుట్ల : మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తులు గొలుసును చోరీచేశారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతానికి చెందిన కట్లకుంట ప్రమీల భర్త సత్యనారాయణ జగిత్యాలలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం భర్త విధులకు వెళ్లిన అనంతరం ఇంటి ప్రధాన ద్వారం వద్ద కూర్చొని ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

రామగుండం ప్రజలు తెలంగాణ వారు కాదా..!

- ఇక్కడి నిధులు గజ్వేల్‌కు ఎత్తుకుపోతున్నారు
- 'బీపీఎల్' భూముల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలి
- బూడిద, ఇసుక, ఉద్యోగాల దోపిడీ రాజ్యం నడుస్తోంది
- ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకమంటూనే నగరం నడిబొడ్డున ఏర్పాటా..?
- పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క


పాదయాత్రలో భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, అడ్లూరి తదితరులు

సాక్షి, పెద్దపల్లి: బొగ్గు ఖనిజ సంపద ఉన్న రామగుండం ప్రజలు తెలంగాణ వారు కాదా..? ఇక్కడ ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ, సీఎస్సార్ నిధులు గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకు ఎత్తుకెళ్లే హక్కు ఎవరిచ్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పీపుల్స్‌మార్చ్‌లో భాగంగా రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ముర్మూర్, గొల్లపల్లి, బ్రహ్మణపల్లి, ఆకేనపల్లి, తక్కెలపల్లి శివారు, పుట్నూర్, జయరాం, రచ్చపల్లి గ్రామాల్లో స్థానికులను కలుస్తూ.. వారి సమస్యలను వింటూ.. వారికి భరోసా కల్పిస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఉండవని ప్రకటించిన కేసీఆర్.. రామగుండం నగరం నడిబొడ్డున ఓపెన్‌కాస్ట్ తెరిచి చిన్నపాటి భూకంపాలకు కారణమయ్యారని మండిపడ్డారు. వాటిని రద్దు చేయించాలన్న సోయి స్థానిక ఎమ్మెల్యేకు లేకపోవడం విచారకరమన్నారు. ఎల్లంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా తొమ్మిదిన్నరేళ్లుగా ఈ ప్రభుత్వం గాడిదలను కాస్తోందా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిచేసి అంతర్గాం, పాలకుర్తి ప్రాంతాలకు నీళ్లు ఇస్తామన్నారు. బీపీఎల్ కంపెనీ ఏర్పాటుకు 1200 ఎకరాలు భూసేకరణ చేసి రెండు దశాబ్దాలు అవుతున్నా.. ఇప్పటివరకు కంపెనీ ఏర్పాటు చేయకుండా ఏం చేస్తున్నారని విమర్శించారు. కంపెనీ ఏర్పాటు చేయకుంటే సేకరించిన భూములను రైతులకైనా ఇవ్వాలని, లేకుంటే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసమైనా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇసుక, బూడిద దందా చేసుకునేందుకు ప్రజలు ఎమ్మెల్యేలుగా గెలిపించలేదన్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు లేబర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే డబ్బులు వసూలు చేయడం సిగ్గు చేటు అని పేర్కొన్నారు. ఉద్యోగాలు రాక.. వసూలు చేసిన డబ్బులు తిరిగి బాధితులకు ఇవ్వకపోవడంతో బాధితుల ఆత్మహత్యలకు కారణమైన ఎమ్మెల్యే ఈ రామగుండానికి అవసరమా..? అని ప్రశ్నించారు. ఇక్కడున్న ఎమ్మెల్యే దోచుకుని దాచుకోవడమే తప్ప ప్రజలకు చేసిందేమీలేదని, ఇక్కడి నదిజలాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నా ఇక్కడి ప్రజల తరఫున ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. తలాపునే గోదావరి పారుతున్నా ఇక్కడి రైతులకు సాగునీరు.. ప్రజలు తాగడానికి చుక్కనీరు అందించని చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదేనని విమర్శించారు.

బీపీఎల్ భూములు తిరిగి ఇవ్వాలి

డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ.. సాగు చేసుకుని జీవనం పొందే అన్నదాతలు తమ భూములను త్యాగం చేస్తే నేడు వారికి మిగిలింది శూన్యమేనని, కనీసం వారికి అందే పరిహారం కోసం కాళ్లరిగేలా తొమ్మిదేళ్లుగా తిరుగుతున్నా ఇచ్చిన పాపన పోవడంలేదన్నారు. సూపర్ క్రిటికల్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుపై పాలకులకు సోయిలేదన్నారు. సేకరించిన బీపీఎల్ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలన్నారు. నిరుపేదలు వేలాదిగా ఇళ్లు లేక కిరాయి ఇళ్లల్లో నివాసం ఉంటుంటే డబుల్ బెడ్ రూమ్ పేరుతో ఏదో నామమాత్రంగా వారి కార్యకర్తలకే కేటాయించారని విమర్శించారు.

బాధితులకు న్యాయం చేయాలి

- డయల్ 100కు తక్షణమే స్పందించాలి
- ఎస్పీ భాస్కర్


మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు తగిన రీతిలో న్యాయం చేయాలని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని, డయల్ 100కు తక్షణమే స్పందించాలని ఎస్పీ భాస్కర్ ఆదేశించారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సంఖ్య, విధుల తీరుపై ఆరా తీశారు. చోరీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. బ్లూకోల్ట్స్', పెట్రోల్‌కార్ 24గంటల పాటు గస్తీ నిర్వహించాలన్నారు. తమకు కేటాయించిన కాలనీల పూర్తిసమాచారం సిబ్బంది వద్ద ఉండాలని సూచించారు. పట్టణ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేయాలని చెప్పారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, ప్రధాన కూడళ్ల వద్ద లైన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్‌పై దృష్టి సారించాలని చెప్పారు. డీఎస్పీ ప్రకాశ్, టౌన్ సీఐ రామచందర్ రావు, ఎస్సైలు రహీం, సందీప్, ట్రాఫిక్ ఎస్సై రాము, సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ చోరీపై ఫిర్యాదు చేయండి

మొబైల్ ఫోన్ చోరీకి గురైనా, ఎక్కడా పడిపోయినా దానిని తిరిగి పొందేందుకు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. సీఈఐఆర్ అప్లికేషన్‌తో మొబైల్‌ను తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సిబ్బంది, అధికారులకు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్(సీఈఐఆర్) అప్లికేషన్‌పై సోమవారం ఆయన శిక్షణ కల్పించారు. చోరీకి గురైన, కనిపించకుండా పోయిన సెల్‌ఫోన్లను వెతికేందుకు పోలీస్ యంత్రాంగం ఇప్పటికే అనేక సాంకేతిక పద్ధతులు అవలంబిస్తోందని తెలిపారు. తాజాగా వచ్చిన సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్‌ను పట్టుకోవడం మరింత సులభతరమైందని వివరించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారెస్ట్ ఆఫీస్‌కు కలప తరలింపు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం ఎన్గల్ శివారులో ఈనెల 5న పోలీసులు పట్టుకున్న కలపను ఎట్టకేలకు సోమవారం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. పది రోజులుగా పోలీస్‌స్టేషన్‌లోనే ఉన్న కలప గురించి బీట్, సెక్షన్ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్గల్‌కు చెందిన కలప వ్యాపారులతో అటవీశాఖ సిబ్బందికి సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కలప స్మగ్లర్లతో టేకు కలపను తెప్పించి వ్యాపారం చేసేందుకు పంట చేనులను అడ్డాగా చేసుకున్నట్లు గ్రామంలో చర్చ సాగుతోంది.

పొంతన లేని సమాధానాలు

పట్టుకున్న కలపను నిబంధనల ప్రకారం పోలీసులు అటవీశాఖ అధికారులకు అప్పగించాలి. కానీ కలప పట్టుకున్న కథనం 'సాక్షి'లో ప్రచురితమైయ్యే వరకు అటవీశాఖ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని తెలుసుకునేందుకు అటవీశాఖకు చెందిన చందుర్తి పరిధిలోని సిబ్బందికి ఫోన్ చేస్తే విషయం తెలిసినప్పటికీ తీరిక లేక పట్టుకున్న కలపను స్వాధీనం చేసుకోలేకపోయామని, స్వాధీనం చేసుకున్న కలప విలువ ఎంత ఉంటుందని ఎఫ్‌ఆర్వో ఖలీలొద్దీన్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. బీట్ అధికారులు ఇంటికెళ్లిపోయారని చెప్పారు.

నష్టం కలగకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలి

జగిత్యాల టౌన్: జగిత్యాల – హనుమకొండ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి తక్కువ నష్టం కలిగేలా రోడ్డు విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎంపీ బండి సంజయ్‌కు లేఖ రాశారు. రహదారికిరువైపులా భూసేకరణ చేపట్టాల్సి ఉండగా ఓ వైపు మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం ఉన్నందున ఒకవైపే భూసేకరణ చేసే పరిస్థితి నెలకొందన్నారు. పూడూర్ గ్రామస్తులు కోట్లు విలువచేసే ఇళ్లు, వ్యవసాయ భూమిని కో ల్పోతున్నారన్నారు. గ్రామానికి తూర్పు వైపున గౌరాపూర్ వైపు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడితే భూసేకరణ వ్యయం తగ్గుతుందని, గ్రామ విస్తరణ కు అనుకూలంగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.